మట్టిబొమ్మలు

ఉదయం ఎనిమిదిగంటల సమయం—

నల్లని కారు నున్నటి రోడ్డుమీద రాకెట్‌వలె దూసుకుపోతున్నది

డ్రైవ్‌చేస్తున్న కృష్ణమోహన్ చాలా హుషారుగా ఉన్నాడు.

"తెలియని ఆనందం

నాలో కలిగెను ఈ ఉదయం..."

పాతపాటను కూనిరాగం తీస్తున్నాడతను.

చేతిలో స్టీరింగ్‌వీల్ ఉన్నా, కళ్ళు రోడ్డుని చూస్తున్నా, మనసులో ఏవేవో సంఘటనలు మెదలుతున్నాయి.

అతనికి ఇరవై ఆరేళ్ళు, అయిదేళ్ళ క్రితం ఎం.ఎస్‌సీ యూనివర్సిటీ ఫస్ట్ రాంక్‌లో పాసయినాడు.

తల్లిదండ్రులు, దగ్గర బంధువులు ఎవరూ లేరతనికి. ఆస్తిపాస్తులూలేవు. ధర్మాత్ముల దయవలన చదువుకొని పెద్దవాడయినాడు.

స్వయంకృషితో పైకి రావటమనే దానికి ఉదాహరణగా కృష్ణమోహన్‌నే చెప్పుకోవాలి.

ఎం.ఎస్‌సి. పూర్తవుతూనే అతని తెలివితేటలకు మెచ్చి ఒక ఇండో-అమెరికన్ సంస్థ ఉద్యోగం యిచ్చింది. ఉద్యోగం చేస్తూనే పార్ట్-టైమ్‌గా రిసెర్చిచేయసాగాడు. ఇటీవలనే అతన్ని పిహెచ్.డి డిగ్రీకి అర్హుడుగా నిర్ణయించింది విశ్వవిద్యాలయం. వచ్చే వారం—ఇదేరోజున—తను నల్లకోటు వేసుకొని, స్టేజీ ఎక్కి డిగ్రీ అందుకుంటాడు సగర్వంగా ఆ దృశ్యాన్ని ఊహించింది మనసు

ముందు వెళ్తున్న కారు నెమ్మదిగా పోతున్నది. కృష్ణమోహన్‌కి చిరాకని పించింది. స్పీడ్ ఎక్కువచేసి, అకారుని 'ఓవర్‌టేక్' చేశాడు. మనసు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు కారు వేగంగా పోతేనే సరదాగా ఉంటుంది!

"కష్టాలెప్పుడూ ఒకటొకటిగారావు, పరంపరలుగా ఒకేమారు వచ్చేస్తాయి" అని షేక్స్‌పియర్ అన్నాడట. కష్టాల మాటేమోకాని, తన విషయంలోసుఖాలు మాత్రం అలాగే వచ్చేస్తున్నాయి! పిహెచ్.డి. పూర్తవుతూనే పనిలో తనుచూపిస్తున్న సమర్థతకు గుర్తింపుగా కంపెనీ ప్రమోషన్ ఇచ్చింది. ఈ క్రొత్తహోదాలో ఆరునెలలపాటు అమెరికా వెళ్ళి ట్రెయినింగ్ అయి రమ్మన్నది. ప్రయాణం ఇంకో నెల రోజుల్లోనే!

పేదరికంలో పుట్టిపెరిగిన తనను ఇంతటి హోదా వరిస్తుందని ఎన్నడయినా కలగన్నాడా? దూరాన ఉన్న కాలేజీకి వెళ్ళేందుకు బస్ ఎక్కలేని తను, విమానంలో విదేశాలకు వెళ్ళనున్నాడు!

కారు కిటికీలోంచి చల్లని గాలి వచ్చి జుట్టు రేపేస్తున్నది. ఆ చల్లనిగాలి

సుప్రియ తలపులనుకూడా లేపింది మదిలో.

సుప్రియ!

ఆమెను తలచుకుంటూండగానే పెదవులపైన చిరునవ్వు విరిసింది.

అన్నిటికీ మించిన అదృష్టం సుప్రియ తనదవటం.

'యూనివర్సిటీ బ్యూటీ' అని పిలిచే వారు అందరూ సుప్రియని. రూప లావణ్యంతోపాటు, ధనవంతుల బిడ్డే మో రకరకాల చీరలతో, నగలతో మెరిసి పోతూ బంగారు బొమ్మలా జిగేలు మంటూ ఉండేది.

దూరంనించి చూసి ఆరాధించేవాడు కాని, తనకు ఆమెతో పరిచయం లేదు.

ఇటీవల ఆమె తండ్రి తనను కలుసుకొని, పరిచయం చేసుకొని, ఇంటికి ఆహ్వానించి, ఆపైన సుప్రియను తనకు ఇచ్చి పెళ్ళిచేయాలనే ఉద్దేశం బయటపెట్టాడు.

ఆనందంతో, ఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేకపోయాడు కృష్ణమోహన్.

తమ వివాహం ఫారిన్ వెళ్ళేలోపలే చేసి, ఆమెనుకూడా తనతో తీసుకు వెళ్లే ఏర్పాట్లు జరిగాయి. పెళ్ళి యింకా రెండు వారాలున్నది. ఈలోపుగా తామి ద్దరూ సినిమాలు, షికార్లతో రోజులు నిమిషాల్లాగా గడిపేస్తున్నారు.

ఇంతకు మించిన సంతోషం ఏ మనిషికయినా ఉంటుందా ?! కృష్ణ మోహన్‌కు ప్రపంచం ఎంతో సుంద రంగా కనిపించటంలో వింత ఏమీ లేదు!

కారు చురుగ్గా అతని కంపెనీవైపు పరిగెడుతున్నది.

మనసు సంతోషసాగరంలో తేలు తున్నది.

ఎదురుగా ... ఎదురుగా... ఏమిటి?? ఓ అయిదారేళ్ళ అమ్మాయి... చేతిలో మట్టిబొమ్మలతో ఆడుకుంటూ, ఏదో పాడుకుంటూ వస్తోంది...పాపా... ఆగు...బొంయ్ మంది హారన్...

"అమ్మా!" అరిచింది పాప.

కీచుమంటూ ఆగింది కారు.

రక్తపు మడుగులో ఆ చిన్నారి శరీరం.

కృష్ణమోహన్ ముఖమంతా చెమట. కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. అతి కష్టంమీద కారు తలుపు తీసుకొని క్రిందకి దిగాడు.

నిశ్చలంగా పడిఉంది పాప. ప్రాణం ఉందోలేదో? మెల్లిగా వంగొని నాడి చూడబోయాడు వణుకున్న చేతులతో. సాధ్యమవలేదు.

రోడ్డుకిరువైపులా దృష్టి సారించాడు. నిర్మానుష్యంగా ఉంది. కాని ఒకటి, రెండు నిమిషాల్లో ఎవరో ఒకరు రాకపోరు.

ఏంచేయాలి ???

ప్రశ్నార్థకం ఇంతై, అంతై నిలిచింది ముందు.

పాపని కారులో వేసుకొని హాస్పిటల్‌కి వెళ్ళాలి ముందు. తర్వాత ఆలోచించాలి ఇతర విషయాలు.

రక్తసిక్తమయిన ఆ దేహాన్ని లేవనెత్తటానికి సంసిద్ధుడయినాడు.

అంతలో మరో ఆలోచన ఎదుట నిలిచి, అతన్ని నిటారుగా నిలబడేటట్లు చేసింది.

పోలీసులు వస్తారు. తనను అరెస్టు చేస్తారు.

'చిన్నపిల్లకి రోడ్ క్రాస్ చేయటం ఏం తెలుస్తుంది? నీవే జాగ్రత్తగా కారు పోనియ్యద్దా' అంటారు.

నిజమేగా ... తన ఆలోచనల్లో తానుండి ఆ పాప సమీపించేవరకు చూసుకోలేదు. తన ఆటల్లో తాను ఉండి ఆ పాపా కారుని చూసుకోలేదు.

మరొకమారు చూశాడు క్రిందకి. ఆ పిల్ల ఒళ్ళంతా రక్తమే. ముఖంమాత్రం స్వచ్ఛంగా ఉంది కళ్ళు తెరిచే ఉన్నాయి కాని, అవి గాజుకళ్ళలా నిర్జీవంగా ఉన్నాయి.

రోడ్డుకి ఇరువైపులా ఇంకొకసారి చూశాడు కృష్ణమోహన్. ఎవరూలేరు. అది ఊరి పొలిమేర. దూరదూరంగా తప్ప ఇళ్లులేవు. సందడేలేదు.

ఆ పిల్ల ప్రాణం పోయేఉంటుంది. ఇప్పుడు చేయగలిగిందీ లేదు. కావాలని నేరం బయటపెట్టుకొని తన భవిష్యత్తు తానే నాశనం చేసుకోవటం ఏమంత వివేకం?

లారీ ఒకటి వస్తున్న చప్పుడయింది. ఇక ఆలోచించలేదు అతను. చటుక్కున కారెక్కాడు.

పాప చేతిలోనించి ఎగిరి, అల్లంతదూరాన పడి విరిగిపోయిన మట్టిబొమ్మలు వెక్కిరిస్తున్నట్లే కనిపించాయి. అతను కారెక్కుతుంటే.

చూపులు మళ్ళించుకొని, వేగంగా వెళ్ళిపోయాడు.

* * *

తానిక ఈరోజుకి ఆఫీసుకి వెళ్ళలేదు. అదిమాత్రం తనకు చేతకాదు. ఇప్పుడు కాస్సేపయినా ఒంటరిగా ఉండాలి. చెదిరిన మనసుని నిబ్బరించుకోవాలి ఆలోచన సరిగా పేర్చుకోవాలి.

కారుని యింటికి పోనిచ్చాడు కృష్ణమోహన్. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ యింట్లో క్రింద ఇంటివాళ్లు, పైన అతను ఉంటున్నారు. నాలుగురోజులుగా ఇంటివాళ్లు ఊళ్ళోలేరు. అదీ ఓ అదృష్టమే.

కారు గారేజ్‌లో పెట్టి వచ్చేస్తుంటే చూశాడు. ఎడమవైపు టైరుకి రక్తం. తన తెల్లని పాంటుకి అంచులో అంటుకొని ఉంది రక్తం

కడుపులో ఎవరో చేయిపెట్టి మెలిపెట్టినట్లే అయింది.



తూలుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, తడి గుడ్డతో టైరుని తుడిచాడు. తర్వాత వెళ్ళి, పంపు క్రింద కాలు ఉంచి పాంటు అంచునీ కడిగేశాడు.

బట్టలు మార్చుకొని ప్రక్కపై వాలాడు. ఏదో నిద్రలో నడుస్తున్నట్లు ఈ పనులన్నీ చేశాడేకాని అతని మనసు స్వాధీనంలో లేదు.

నిర్జీవమైన ఓ జత కళ్ళు అతన్ని వెంటాడుతున్నాయి.

ఆ పిల్ల ఎవరో!?

పనిపాటలు చేసుకొనే వాళ్ళ అమ్మాయిలాగా ఉంది. విరిగిపోయిన మట్టిబొమ్మలు అతని కళ్ళముందు నిలిచాయి.

"అమ్మా!" ఆ పిల్ల అరుపు భయంకరంగా చెవుల్లో వినిపిస్తూనే ఉంది.

ఎవరయినా హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారా! బ్రతికిందా? లేదా?

ఆ పాప బ్రతకాలి - మనసులోని శక్తంతా వెచ్చించి గాఢంగా కోరుకున్నాడు.

కాని కోరుకున్నవన్నీ నిజాలవుతాయా?

కనీసం, నిజం చేయటానికయినా తను ప్రయత్నించాడా?

అమానుషంగా వదిలేసి పారిపోయాడు.

తన ప్రవర్తన ఎంత అసహ్యంగా ఉంది! [అతనికి సిగ్గుతో ఒళ్ళు సెగలు కక్కినట్లే అయింది.

కాని ఆ పిల్లను తను హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి ఉంటే, తన నేరాన్ని వెల్లడి చేసుకుంటే, తనకు ఏం లభించేది? అరెస్ట్-కోర్టు-శిక్ష-

ప్రమోషన్ కాన్సిలయేది, అసలు ఉద్యోగమే ఉండేదీ-

సుప్రియతో పెళ్ళి కాన్సిలయేది—

ఇంతవరకు తనను గౌరవించిన వాళ్ళంతా అసహ్యించుకొనేవారు —

తను ఇదంతా భరించలేడు! భరించ లేడు!!

ఎంతో కష్టపడి ఈ దశకు వచ్చాడు తను. రెప్పపాటు కాలంలో జరిగిపోయిన ఈ సంఘటనవలన ఇదంతా కూలిపోతే, తను భరించలేడు.

మబ్బుకమ్మితే చీకటి ఆవరిస్తుంది. మబ్బు తొలిగితే వెలుగే నిండుతుంది.

ఈ సంఘటనవలన తన జీవితం చీకటి కారాదు అందుకే కదూ తను పారిపోయి వచ్చాడు.

ఆ పాప ప్రాణం ఉన్నదో, పోయిందో?

మళ్ళీ అదే ప్రశ్న.

నిర్జీవమైన కళ్ళు ఎదుట నిలిచాయి.

పాప స్వరం — "అమ్మా!" చెవుల్లో గింగురుమంది.

తను హంతకుడు!

తల వేడెక్కిపోతున్నది. ఆ కళ్ళు సదా వెంటపడుతుంటే, ఆ స్వరం నిత్యం చెవుల్లో వినిపిస్తూఉంటే మాత్రం తను భరించగలడా?!

చావుబ్రతుకుల్లో ఉన్న పాపని వదిలేసి తనదారి తను చూసుకున్నాడే- ఈ గిల్టీఫీలింగ్ తనను వదులుతుందా?

లేచి ఏదయినా చేయాలి...ఆలోచ నలనుంచి తప్పించుకోవాలి...

పోలీసుల వద్దకు వెళ్ళి, జరిగింది చెప్పేస్తే ఈ మానసికమయిన శిక్ష తప్పుతుందేమో?

ఊహూం, ఆ పనీ చేయలేడు తను.

పక్కమీద దొర్లి దొర్లి విసుగెత్తి లేచాడు కృష్ణమోహన్.

చటుక్కున మరో ఆలోచనవచ్చింది. పారిపోయి వచ్చేసినా తను పట్టు బడ్తాడేమో! ఎలాగయినా తన నేరం బయటకు వస్తుందేమో!

ప్రతి మనిషిలోను దానవుడు, దేవుడుకూడా ఉన్నారు. కృష్ణ మోహన్‌లో జరుగుతున్న దైవ, దానవ సంఘర్షణలో అతను నలిగిపోతున్నాడు.

ఒంట్లో బాగాలేదని, ఆఫీసుకి రాలే నని ఫోన్‌చేసి చెప్పాడు.

నిస్త్రాణగా కుర్చీలో వాలిపోయిన అతనికి కాలగమనంకూడా తెలియలేదు.

సాయంత్రం సుప్రియ వచ్చి తలుపు తట్టింది.

ఎవరూ తలుపుతీయలేదు కాని లోపలం గడియవేయనందున నెట్టే తెరుచుకుంది.

లోపల కుర్చీలో కూర్చున్న కృష్ణ

మోహన్ పది లంకణాలు చేసినట్లు న్నాడు.

నిన్నటికి, ఈ రోజుకి అతనిలోని మార్పుకి నివ్వెరపోయింది ఆమె.

దగ్గరగా వెళ్ళి నుదిటిపైన చేయి వేస్తూ మృదువుగా పిలిచింది- 'కృష్ణా!'

కృష్ణమోహన్ కళ్ళుతెరిచాడు నుదుటి పైనున్న చేయి గట్టిగా పట్టుకు న్నాడు. తుఫానులో కొట్టుకుపోతున్న వ్యక్తికి ఆధారం దొరికినట్టే అయింది.

"సుప్రియా! నన్ను వదిలేసి వెళ్ళవు కదూ? కష్టానికయినా సుఖానికయినా నాతోనే ఉంటావుకదూ? చెప్పు!"

"ఏం జరిగింది, కృష్ణా? ఎందుకిలా ఉన్నావు?"

జరిగినదంతా చెప్పేయాలనేకోరికను నిగ్రహించుకున్నాడు కృష్ణమోహన్.

"ఏంలేదు ... ఏంలేదు ..." తడ బాటుగా అన్నాడు.

"పిచ్చి కృష్ణా! చూస్తే జ్వరంవచ్చి నట్లుంది అందుకే ఇలా మాట్లాడు తున్నావు ఇప్పుడు నీకు కష్టాలేం వచ్చి నాయి? ముందున్నవన్నీ సుఖాలే. కాస్త జ్వరానికి ఇలాగయిపోతే ఎట్లా?? ఎంత బలహీనుడివి డార్లింగ్!" సుతారంగా నవ్వింది సుప్రియ

'బలహీనుడినా? స్వార్థపరుడినా?'— అనుకున్నాడు కృష్ణమోహన్.

బలవంతంగా అతన్ని తన యింటికి తీసుకువెళ్ళింది సుప్రియ.

అతనికి చాలా చిరాకుగా ఉంది ఉన్నట్లుండి సుప్రియపట్ల కోపం ముంచుకువచ్చింది. ఈ సుప్రియకోసం కదూ తను ఆ పసిపిల్లను రక్తపు మడుగులో వదిలేసి వచ్చింది? ..

చుట్టూ వున్న ప్రపంచంపట్ల కూడా ఏదో కసి ఆవరించింది అతనిలో. ఈ ప్రపంచంలో ఔన్నత్యంకోసం ఎంత నీచంగా ప్రవర్తిందారు! ఈ సమాజపు గౌరవాన్ని పోగొట్టుకోవట మవుతుందనే భయమేగా తన ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోవటానికి కారణం?

అంతలోనే తమాయించుకున్నాడు అతను. సుప్రియనీ, ప్రపంచాన్ని తిట్టుకోవటంలో అర్థంలేదు. నేరంచేసింది తను, శిక్షకు భయపడి పారిపోయింది తను. ఆ పారిపోవటంలో మరో జీవి ప్రాణాలను సైతం లెక్కచేయక పోవటం స్వార్థానికి పరాకాష్ఠ.

నిర్జీవంగా ఉన్న పెద్ద కళ్ళు వెంటే ఉండి, అతన్ని నిలవనీయటంలేదు.

'పాపా! పాపా! బతికే ఉన్నావా?' నా పిహెచ్.డి. డిగ్రీకన్నా, ప్రమోషన్ కన్నా, విదేశీయానం కన్నా, పెళ్ళి కన్నా, అన్నిటికన్నా విలువయినది తోటిమనిషి ప్రాణం.

'పాపా! నన్ను హంతకుడిని చేయ కమ్మా! దయచేసి బతికే ఉండమ్మా! నన్ను క్షమించి, బతికే ఉండు తల్లీ!'

కళ్ళముందు విరిగిపోయిన మట్టి

బొమ్మలు మెదిలాయి 'మనమంతా మట్టిబొమ్మలమే' అంది మనసు.

అతని ప్రవర్తన అర్థంకాక, జ్వర ప్రభావమనిసరిపెట్టుకున్నారు. సుప్రియ. ఆమె తల్లిదండ్రులు. డాక్టరుని పిలిపిస్తే ఏదో మందు ఇచ్చి వెళ్ళాడు.

ఆ రాత్రంతా కన్నుమూయలేదు కృష్ణమోహన్. ప్రొద్దున్నే, ఇంట్లో ఎవరూ లేవకముందే వరండాలోకి వచ్చి కూర్చున్నాడు, ఆ రోజు వార్తాపత్రిక కోసం ఎదురుచూస్తూ.

పేపర్లో మొదటిపేజీలోనే ఉంది అతను వెతుకుతున్న వార్త.

"నిన్న ఉదయం-రోడ్డులో కారు క్రింద పడిపోయిన అయిదేళ్ళ పాప రాత్రి హాస్పిటల్‌లో మరణించింది రక్తం బాగా కోల్పోవటంవలన మరణం సంభవించినట్లు తెలుస్తున్నది. తెలివి తప్పిన స్థితిలో ఉన్న పాపను వదిలేసి కారుతోసహా డ్రైవరు పారిపోయినాడు. పాప తల్లి ఇరవైనాలుగేళ్ళ వితంతువు లక్ష్మి, ఒక్కగానొక్క కూతురి మరణ వార్త వింటూనే గుండె ఆగి చనిపోయింది. ఇంతటి ఘాతుకమైన ట్రాజడీకి కారకుడయిన కారు వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు."

కృష్ణమోహన్ చేతిలోనించి పేపరు జారిపోయింది.

సుడిగుండంలో కొట్టుకుపోతున్నట్టే ఉంది అతనికి.

'పాపా, నేను హంతకుడినే! నిన్నే కాక నీ తల్లినీ చంపిన నీచుడిని.'

తనకోసం పోలీసులు గాలిస్తున్నారుట. ఆ వార్త ఎందుకో సంతోషాన్నే కలిగించింది. తన నేరానికి అంతరాత్మ విధిస్తున్న ఈ శిక్షకంటె, చట్టం విధించే శిక్ష తక్కువగానే ఉంటుంది.

మనిషి తనముందు తానే తలవాల్చుకొనవలసి రావటానికి మించిన అవమానం మరొకటిలేదు.

తప్పుచేయటం మానవసహజం. శిక్ష అనుభవించటం విశ్వధర్మం. చట్టంనించి తప్పించుకున్నా, మనోఘర్షణనుంచి తప్పించుకోవటం ఎలా?

'పాపా! నిన్ను వెంటనే హాస్పిటల్‌కి నా కారులోనే తీసుకువెళ్తే బ్రతికేదానివేమో?!'

ఎవరూ జవాబు చెప్ప(లే)ని ప్రశ్న అది.

బ్రతికి ఉన్నన్నాళ్ళు తనను తినేస్తూ ఉండే ప్రశ్న అంది.

తనంతట తాను వెళ్ళి పోలీసులకు జరిగింది చెప్పేసి, పట్టుబడిపోతే కొంతయినా మనశ్శాంతి లభిస్తుందేమో!

కాని...కాని...తను జీవితమంతా జైల్లో మగ్గినా ఆ పాప తిరిగిరాదు. పాప తల్లీ తిరిగిరాదు.

తన జీవిత పుష్పాన్ని తానే నలిపి పారేయటం తెలివయిన పనికాదు. జరిగి

పోయినదానిని మరిచిపోవటానికి ప్రయత్నించటమే మేలు.

కాని...ఆ పాపసంగతో? క్షణాల మీద ఆ పువ్వుని కాలరాచి పారేశాడే? ఆక్సిడెంట్ పొరపాటున జరిగినా, వదిలేసిరావటం తాను కావాలని చేసిన పనేకదా?

అన్నీ ప్రశ్నలే! జవాబులేని ప్రశ్నలే. అవి చుట్టుముడుతుంటే సుడిగుండంలో చిక్కుకున్నట్లేఉంది.

నిర్జీవమైన కళ్ళు-రక్తపు మడుగు-పగిలిపోయిన బొమ్మలు - ఆ దృశ్యమే మదిలో నిలుస్తున్నది.

అయోమయంగా ఉన్న అతని వాలకం అర్థంకాక సతమతమవుతున్నారు సుప్రియ, ఆమె తల్లి తండ్రులు.

ఆఫీసుకి వెళ్ళటం మానేశాడు అతను

వారంరోజులు గడిచాయి.

పిహెచ్ డి డిగ్రీ అందుకోవలసిన రోజు ఆసన్నమయింది. ఆసాయంత్రమే ~~విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం.~~

ఉదయమే వచ్చారు అతని స్నేహితులు కొందరు. కాన్వొకేషన్ అయిపోయాక ఆ రాత్రికి తామంతా అతనికి హోటల్‌లో డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పారు.

నిరాసక్తిగా కూర్చున్న అతని వాలకం వాళ్ళకి వింతగాఉంది.

సుప్రియ చెప్పింది, అతనికి ఒంట్లో బాగాలేదని, రాలేదని.

అమెరికావెళ్ళేలోపల తమవద్ద మరో రోజయినా పీడ్కోలు విందు తీసుకోవాలని చెప్పి వెళ్ళిపోయారు మిత్రులు. వాళ్ళు వెళ్ళాక నిలదీసి అడిగింది సుప్రియ, అసలేం జరిగిందని

అతనేమీ చెప్పలేదు. బాణంతగిలి, గాయపడి విలవిల్లాడుతూ పడిపోయిన పక్షిని గుర్తుకుతెచ్చాయి అతనిమాపులు. ఆమె మరేమీ అడగలేకపోయింది. ఆ సాయంకాలం మాత్రం బలవంతంగా కార్లో అతన్ని యూనివర్సిటీ కాన్వొకేషన్‌కి తీసుకువెళ్ళింది.

డిగ్రీలు పుచ్చుకోవలసిన ఇతరులతో కలిసి నల్లకోటు, కాప్ ధరించి ముందు వరసలో కూర్చున్నాడు. కృష్ణమోహన్. అందరిలోను ఉత్సాహం వెల్లివిరుస్తున్నది —అతనిలో తప్ప!

స్టేజీమీద ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఎవరెవరో పెద్దలు. కృష్ణమోహన్‌కి ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లున్నది కూర్చో~~లేకపోతున్నాడు.~~

చిన్నగా లేచి బయటకు వచ్చాడు. హడావిడిలో ఎవరూ గమనించలేదు.

బయటకు వచ్చాకకూడా సుప్రియ కాని, మరెవరయినా ఇతర మిత్రులు కాని చూస్తారేమోనన్నట్లు, వెనుదిరిగి చూడకుండా చాలామారం వడివడిగా నడిచాడు.

ఎక్కడికి వెళ్తున్నాడో, ఎందుకు వెళ్తున్నాడో అతనికే తెలియదు.

తెలిసినదల్లా ఒక్కటే-తను స్టేజీ ఎక్కి డిగ్రీ అందుకొనే ఈ గౌరవానికి తగడు ; ఉద్యోగంలో ప్రమోషన్‌కి, ఫారిన్‌ట్రిప్‌కి తగడు; సుప్రియను పెళ్ళిచేసుకోవటానికి అసలు అర్హుడే కాదు.

ఎక్కడో సినిమాపాట వినవస్తున్నది

"అందమైన జీవితము అద్దాల సౌధము

చిన్నరాయి తగిలినా ముక్కలే మిగులును..."

కనిపించిన బస్ ఎక్కాడతను. తోచినచోట దిగేశాడు. దిగి చుట్టూ చూస్తే, టాంక్‌బండ్ మొదట్లోఉన్న పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్నట్టు తెలిసింది.

పోలీస్‌స్టేషన్?

తను వెళ్ళవలసిన చోటు ఇదే. నేరాన్ని వెల్లడిచేసి శిక్ష, అనుభవించాలి. తప్పదు! ఏమీ జరగనట్లు వెనకటిలాగే జీవించటం మాత్రం అసాధ్యం.

'కాని నేను ఏ శిక్ష అనుభవించినా నువ్వు తిరిగి రావమ్మా, చిట్టితల్లీ ! నిన్ను చంపేశాను పాపా!' విషాదంగా ఆక్రోశించింది అతని హృదయం. 'మీ అమ్మనీ బలిపెట్టుకున్నానమ్మా నేను...సంఘంలోని ఉన్నత స్థానాన్ని పోగొట్టుకుంటానని భయపడ్డాను. దాని కోసం దిగజారిపోయాను...'

కానీ పోలీస్‌స్టేషన్‌లోకి అడుగు పెట్టలేకపోయాడతను. ప్రశ్నలు, జవాబులు, సంజాయిషీలు, కోర్టు-ఇవన్నీ తాను భరించలేడు. పూలు అమ్మినచోట కట్టెలు అమ్మలేడు.

టాంక్‌బండ్ పైన నడవసాగాడతను. రాత్రి పదిగంటలుదాటినా అట్లా ఆ వంతెనపైనే అటూ, ఇటూ తిరుగుతూ ఉండిపోయాడు.

తనలోని ఘోషను భరించలేకతున్నాడు. 'పాపా! నా స్థానం ఈ సంఘంలో కాదమ్మా...నీ వద్ద... నీ తల్లివద్ద...'

వంతెన రెయిలింగ్‌పైన ఒకకాలు ఉంచాడు. రెండోపాదం శూన్యంలోకి పెట్టాడు. అతని ప్రాణం విశ్వంలో లీనమయిపోయే చివరి క్షణానస్ఫురణకు వచ్చాయి-ఆనాడు రోడ్డుపైన పగిలి, ముక్కలయిపోయిన మట్టిబొమ్మలు.